సాక్షి నంద్యాల

గురువారం । 9 । జనవరి । 2025



ఉత్తర దర్శనం.. నిత్య వైభవం

వైష్ణవ క్షేత్రాల్లో భక్తులకు వైకుంఠ ఏకాదశి రోజున మాత్రమే ఉత్తర ద్వారంలో స్వామిని చూసే అవకాశం ఉంది. ఇక్కడ 365 రోజులు ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకోవచ్చు. 8లో▸



అలరించిన హరికథాగానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై బుధవారం నిర్వహించిన వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన ఎం.ఉపేంద్ర భాగవతార్ శ్రీశైల మహాత్యం హరికథాగానం అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1.633
ప్రస్తుతం	:1,624.48
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:74.743
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:0
అవుట్ ఫ్లో	:8,270

న్యూస్‌రీల్

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న ఆర్ఎం రజియా సుల్తానా

నంద్యాల (వ్యవసాయం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లాలోని అన్నీ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి రజియా సుల్తానా తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఈనెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 115 బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుగు ప్రయాణం కోసం 14వ తేది నుంచి 19వ తేది వరకు 60 బస్సులు నడుపుతామన్నారు. ఈ బస్సుల్లో రానుపోను టికెట్లను ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ వస్తుందని వెల్లడించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

జూపాడుబంగ్లా: లేబర్ బడ్జెట్ పూర్తిచేయకపోవడంతో తాటిపాడు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నలింగన్నను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈమేరకు బుధవారం ఉపాధిహామీ పథకం పీడీ ఎం.జనార్దన రావు ఉత్తర్వులు జారీచేసినట్లు ఏపీఓ గౌరీబాయి తెలిపారు. సదరు ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలో ఉపాధి పనులు కల్పించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయన్నారు. అలాగే 15, 16, 18 సోషల్ ఆడిట్లలో అవినీతి ఆరోపణలు సైతం వచ్చాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోస్పాడు: ఫార్మసిస్ట్ ఉద్యోగాలు కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్న నేపథ్యంలో అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్ఓ వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 17వ తేది సాయంత్రం 5 గంటలలోపు ప్రాంతీయ సంచాలకులు వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం కడపలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు cfw.ap.gov.in వెబ్ సైట్‌ను సంప్రదించాలన్నారు.

స్టాఫ్ అసిస్టెంటు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకులో ఖాళీగా ఉన్న 50 స్టాఫ్ అసిస్టెంటు పోస్టుల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ జారీ అయింది. ఇందులో 13 పోస్టులు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పని చేసే సిబ్బందికి కేటాయించారు. మొత్తం పోస్టుల్లో 29 పోస్టులు జనరల్, 21 పోస్టులు మహిళలకు కేటాయించారు. రోస్టర్ ప్రకారం భర్తీ చేస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ నెల 8 నుంచి అప్‌లోడ్ చేసుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. దరఖాస్తుల అప్‌లోడ్‌కు ఈ నెల 22వ తేదీ వరకు గడువు ఉంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. నోటిఫికేషన్ పూర్తి వివరాల కోసం www. kurnool dccb. com వెబ్‌సైట్ ను సందర్శించవచ్చని డీసీసీబీ అధికార వర్గాలు తెలిపాయి.

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షల్లో 90 శాతం మంది హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం జరిగిన ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షల్లో 90 శాతం హాజరు నమోదైందని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 2,4,6,8,10 సెమిస్టర్ పరీక్షలకు 553 మందికి 496 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. కర్నూలు ఉస్మానియా కళాశాల పరీక్ష కేంద్రాన్ని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సందర్శించి పరిశీలించారు. ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

కేసీ కాలువ కాలుష్యంపై సీపీసీబీకి, పీఎంఓకు ఫిర్యాదు

కర్నూలు కల్చరల్: నగరంలోని కేసీ కాలువ భారీగా కాలుష్యంతో నిండిపోయిందని న్యాయవాది కె.గణేష్ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి, పీఎంఓకు ఫిర్యాదు చేశారు. కాలువలో మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు కలిసిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో తెలిపారు. కాలుష్యం వల్ల దోమలు పెరిగి, వ్యాధులు వ్యాప్తి చెందడంతోపాటు జలచరాలు నశించి పోతున్నాయని వివరించారు. తాగునీరు కలుషితమై అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కార్పొరేషన్, నీటి వనరుల శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంతా తారుమారు

ఇది అవుకు– కొండమనాయిని పల్లె రోడ్డు మలుపు. ఈ మార్గంలో 13 కి.మీ మేర రహదారిని బాగు చేసేందుకు రూ.10 లక్షల నిధులు వెచ్చించారు. పనులు చేసిన 15 రోజుల వ్యవధిలోనే కంకర పైకితేలి పాత రోడ్డునే తలపిస్తోంది.



రూ. **30.82** కోట్లు
430 కి.మీ. మేరలో రహదారి మరమ్మతులకు మంజూరైన నిధులు

129
గతుకులకు ప్యాచింగ్ చేసే పనుల సంఖ్య

94 ఇప్పటి వరకు పూర్తి అయిన ప్యాచింగ్ పనుల సంఖ్య

- కూటమి ప్రభుత్వం మాయజాలం
- ఆర్భాటంగా రహదారుల మరమ్మతు పనులు
- జిల్లాలో గుతుకులకు నాసిరకం అతుకులు
- వేసిన 10–15 రోజులకే లేచిపోయిన తారు
- ప్రజాధనం దుర్వినియోగం
- చోద్యం చూస్తున్న అధికారులు



కోవెలకుంట్ల – సంజామల రహదారి ఇది. ఈ మార్గంలో 8.4 కి.మీ పరిధిలో గుంతలు పూడ్చేలా రూ.4.65 లక్షలతో పనులు చేపట్టారు. ఈ పనులు తూతూ మంత్రంగా చేయడంతో కొద్దిరోజులకే రోడ్డుపై ఇలా గుంతలు దర్శనమిస్తున్నాయి.





గోస్పాడు మండలం యాళ్లూరు బైపాస్ రోడ్డు ఇది. 650 మీటర్ల మేరకు ఈ రోడ్డుపై గుంతలు ప్యాచింగ్ చేసేందుకు రూ.4.40 లక్షలు ఖర్చు చేశారు. మరమ్మతులు చేసిన నెలరోజుల్లోనే కంకర లేచి రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. ఈ కొత్త బైపాస్ రోడ్డుపై ఇంకా భారీ వాహనాల రాకపోకలు మొదలైతే పరిస్థితి ఎలా ఉంటుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోస్పాడు: కూటమి నాయకులు ఎన్నికల ముందు రోడ్ల నిర్వహణపై నానా హంగామా చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని, ఎక్కడా గోతులు లేకుండా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పారు. ఏడునెలలవుతున్నా కొత్త రోడ్ల మాట దేవుడెరుగు, అక్కడక్కడ చేస్తున్న ప్యాచ్ వర్క్‌లపై కూడా పర్యవేక్షణ లేదు. దీంతో వారం పది రోజులకే తారు, కంకర వేర్వే పోయి యథా ప్రకారం గుంతలు దర్శనమిస్తున్నాయి. కేవలం రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టారు కానీ, ఆయా పనులు కూడా పూర్తి నాణ్యతతో చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్టేట్ హైవేస్, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లపై కూడా పనులు అంతంత మాత్రంగానే చేపడుతున్నారు. ఎస్‌హెచ్, ఎండీఆర్ రోడ్ల పరిస్థితే ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్అండ్‌బీ రోడ్లకు కేవలం పైపూతలు పూస్తు మమ అనిపిస్తున్నారు. మిషన్ పార్ట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా జిల్లాలో 439 కిలోమీటర్ల మేర రూ. 3,082 లక్షలతో 129 పనులు మంజూరయ్యాయి. గత ఏడాది నవంబర్ 2వ తేదీన ప్రారంభించిన ఈ పనుల్లో ఇప్పటి వరకు 391 కిలోమీటర్ల మేర ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే జిల్లాలో పూర్తిస్థాయిలో దెబ్బతిన్న రోడ్లను వదిలి నామ్‌కే వాస్తే కొన్ని రోడ్లను మాత్రమే ఎంపిక చేసి మరమ్మతులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కానరాని నాణ్యత

జిల్లాలోని పలు రోడ్లపై గుంతల పూడ్చివేత పూర్తి నాసిరకంగా చేపట్టడంతో కంకర బయట పడింది. దీంతో రాకపోకల విషయంలో వాహనదారులకు ఇబ్బందులు తిరిగి ప్రారంభమయ్యాయి. చేస్తున్న పనులపై అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కాంట్రాక్టర్ల అవతారమెత్తిన కూటమి నేతలు ఇష్టారాజ్యంగా ఈ పనులు చేపడుతున్నారు. మరికొన్ని రోడ్లలో అసలు పనులే ప్రారంభించ లేదు. మరో వారం రోజుల్లో చేపట్టిన అన్ని రోడ్ల పనులను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటి వరకు 129 పనుల్లో ఇంకా 35 పనులు చేయాల్సి ఉంది. అంటే దాదాపు 30 శాతం పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి కావాలి. ప్రస్తుతం జరిగిన పనులు సైతం తూతూమంత్రంగా చేపట్టడంతో ప్రజాధనం వృథా తప్ప ప్రయోజనం లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.**80.31** లక్షలు
జంగిల్ క్లియరెన్స్ పనులకు మంజూరైన నిధులు

550 కి.మీ. కంపచెట్లు, పిచ్చిమొక్కల తొలగింపు పనుల రహదారి పొడవు

258 కి.మీ. ఇప్పటి వరకు పూర్తి అయిన పనుల రహదారి పొడవు

ముందుకు సాగని జంగిల్ క్లియరెన్స్ పనులు

జిల్లాలో జంగిల్ క్లియరెన్స్ కింద 550 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కల తొలగింపు కోసం రూ.80.31 లక్షలు మంజూరు చేశారు. అయితే, ఈ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు కేవలం 258 కిలోమీటర్ల మేర పనులు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మిగతా పనులు ఇంకెప్పుడు పూర్తి అవుతాయో తెలియని పరిస్థితి.

కాంట్రాక్టర్లకు కలిసి వచ్చేలా..

సంక్రాంతి పండుగలోపు రహదారి మరమ్మతులు, కంపచెట్ల తొలగింపు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు హడావుడిగా చేస్తున్నారే తప్ప వాటి నాణ్యతను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ రెండు రకాలకు సంబంధించి మొత్తం 151 పనులు ఉన్నాయి. వీటిలో సగం వరకు రూ. 5 లక్షల లోపు ఉండటంతో కాంట్రాక్టర్లకు కలిసి వచ్చే అంశంగా మారింది. రూ. 5లక్షల పైబడి చేసే పనులకు క్వాలిటీ కంట్రోలు నిబంధనలు పాటించాలి. తక్కువ మొత్తంలో ఉన్న వాటికి అవేవీ ఉండవు. దీంతో ఈ పనులు కాంట్రాక్టర్ల అవతారమెత్తిన కూటమి నాయకులకు అప్పగించారు. కాసుల కోసం కొందరు రోడ్లపై తారు, కంకర మిక్సింగ్ వేసిన తర్వాత రోలింగ్ చేయడం లేదు. మ్యానువల్ పద్ధతిలో చేస్తుండటంతో కొద్దిరోజులకే తారు, కంకర లేచిపోతుందని వాహనదారులు వాపోతున్నారు.

శ్రీశైలంలో రేపు ముక్కోటి ఏకాదశి ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించనున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేకువ జామున స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉత్తరద్వార దర్శనం, రావణవాహనసేవ నిర్వహిస్తా మని అన్నారు. ఉదయం 3 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి మంగళవాయిద్యాల అనంతరం 3.30 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, 4.30 గంటలకు స్వామివారికి, అమ్మవారికి మహామంగళహారతులు జరిపిస్తారన్నారు. అనంతరం 5.30 గంటలకు రావణవాహన సేవ,స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం, అనంతరం 6 గంటలకు సర్వదర్శనం, ఆర్జితసేవలు ప్రాంభమవుతాయన్నారు.

అప్రెంటీషిప్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

డోన్ టౌన్: ఈ నెల 16వ తేది స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జరగనున్న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీషిప్ మేళాను ఐటీఐ పాసైన వారు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేళాకు కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన పలు కంపెనీలు ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగానే ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. అలాగే టెన్త్, ఐటీఐ పాస్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు కుల ధ్రువీకరణ, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్, పాన్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని మేళా జరిగే రోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

11న మద్యం దుకాణాల్లోని ఫర్నీచర్ వేలం

నంద్యాల: ఏపీఎస్‌బీసీఎల్ నంద్యాల డిపో పరిధిలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని ఫర్నీచర్‌కు సంబంధించి ఈ నెల 11న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జి. నాగేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం దుకాణాల్లోని ఫ్రిజ్‌లు, లాకర్లు, కంప్యూటర్లు, ఇన్వర్టర్లు, ర్యాకర్లు తదితర వాటిని వేలం వేస్తామని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వివరాలకు సెల్: 94914 08411, 90599 08198 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఉప కమిషనర్, వేదపండితులు



సహస్ర దీపాలంకరణ సేవలో గజ వాహనంపై మద్దిలేటి స్వామి


బేతంచెర్ల: మండల పరిధిలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీమద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయు నాయక్, వేద పండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో గోపూజ, యాగశాలలో ప్రత్యేక పూజలు కోయిల్వార్ తిరుమంజనం, మత్స్యం గ్రహణం, సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. సాయంత్రం హనుమద్ వాహనంపై స్వామి ఉత్సవ మూర్తికి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు.

పోలీసుల అదుపులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్

ఆళ్లగడ్డ: రెడ్‌బుక్ రాజ్యాంగంతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా చేస్తున్న వేధింపులు ఆగడం లేదు. తాజాగా ఆళ్లగడ్డ మున్సిపల్ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్ చక్రపాణిని తాడిపత్రిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఆయన అరెస్టు విషయం పోలీసులు తమకు తెలియదనడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ కేసు విషయంలో నిందితుడిగా ఉన్న చక్రపాణి తాడిపత్రిలో బంధువుల ఇంటి దగ్గర ఉన్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇద్దరు వ్యక్తులు ఆళ్లగడ్డ పోలీసులం అని చక్రపాణిని తమ వెంట తీసుకుపోయారని బంధువులు తెలిపారు. కాగా రాత్రి పొద్దుపోయేవరకు అతడిని ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్‌కు తీసుకురాకపోవడంతో వచ్చింది పోలీసులా లేక ప్రత్యర్థులు వచ్చి అపహరించుకుపోయారా? అని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై పట్టణ సీఐ చిరంజీవిని వివరణ కోరగా తాము ఎవరినీ అరెస్టు చేయలేదని చెప్పడం గమనార్హం.

స్వయం ఉపాధికి తోడ్పడండి

- బ్యాంకర్లతో జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: బీసీ, ఈబీసీ వర్గాల్లోని పేదల ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బీసీల స్వయం సమృద్ధి రుణాల మంజూరుపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 –25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈ బీసీ వర్గాలకు వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ సర్వీసులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. జిల్లాలో 2,156 మంది బీసీలకు రూ. 45.84 కోట్ల రుణాలు వివిధ పథకాల కింద అందించాలన్నారు. అలాగే ఈబీసీకి సంబంధించి 73 యూనిట్లకు 1.27 కోట్లు , కమ్మ కార్పొరేషన్ కింద 15 యూనిట్లకు 26 లక్షలు, రెడ్డి కార్పొరేషన్ కింద 45 యూనిట్లకు 78 లక్షలు, ఆర్య వైశ్య కార్పొరేషన్ ద్వారా 26 యూనిట్లకు 45 లక్షలు, బ్రాహ్మిన్ కార్పొరేషన్ కింద 10 యూనిట్లకు 17 లక్షల మేర స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. వీటన్నింటినీ పరిశీలించి అవసరమైన, అర్హత గల వ్యక్తులకు మాత్రమే రుణాలు మంజూరు చేయాలన్నారు. 21 నుంచి 60 సంవత్సరాల లోపు ఉన్న బీసీ వర్గాల వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఈనెల16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్, ఎల్డీఎం రవీంద్ర కుమార్, యూబీఐ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సురేంద్ర గౌడ్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మనోహర్, బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ సుందర రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం

- తోటి వారి పట్ల శాంతి, కరుణ, ప్రేమ చూపాలి
- నిత్యం అల్లా ఆరాధనలో గడపాలి
- ఆత్మకూరు ఇస్తెమాలో మౌల్వీల పిలుపు
- ప్రత్యేక ప్రార్థనలకు లక్షలాదిగా తరలివచ్చిన ముస్లింలు
- సందర్శించిన మంత్రి ఫరూక్, ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లింలు



మాట్లాడుతున్న మౌల్వీలు

ఆత్మకూరు: ప్రవక్త మార్గం అనుసరణీయమని.. ప్రతి ఒక్కరూ ఆచరించాలని మౌల్వీలు ఖాజాసాహెబ్, ముఫ్తీ ఫరూక్ ముస్లింలకు పిలుపునిచ్చారు. ఆత్మకూరు శివారులో నిర్వహిస్తున్న ఇస్తెమాకు రెండోరోజు భారీగా ముస్లింలు తరవలివచ్చారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలతో పాటు ప్రకాశం తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి. హైదరాబాద్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మత పెద్దలు మాట్లాడుతూ ఇస్లాం గొప్ప తనాన్ని వివరించారు. ప్రతి ముస్లిం అల్లా ఆరాధనలో గడపాలని సూచించారు. తోటి వారి పట్ల శాంతి, కరుణ, ప్రేమతో మెలుగుతూ, కష్టాల్లో ఉన్నవారికి సాయపడాలని చెప్పారు.

సందర్శించిన మంత్రి, అధికారులు

రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి ఇస్తెమా ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అంతకు ముందు మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇస్తెమా ప్రశాంతంగా జరుగుతుందని, పెద్ద సంఖ్యలో ముస్లింలు వచ్చారన్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుందని చెప్పారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరులో పెద్ద ఎత్తున ఇస్తెమా జరగడం సంతోషంగా ఉందన్నారు.

నేడు దువా

ఇస్తెమా ఆఖరి రోజు అయిన గురువారం ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్నాయి. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి లక్షలాదిగా ముస్లింలు ఆత్మకూరుకు తరలివచ్చారు. నేడు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. విశ్వశాంతి, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సామూహికంగా ముస్లింలు ప్రార్థన (దువా) చేయనున్నారు.



ఇస్తెమాకు తరలివస్తున్న ముస్లింలు



భోజనాలు చేస్తున్న దృశ్యం



ఇస్తెమా ప్రదేశంలో మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే, తదితరులు

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత

- పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి



మొక్కజొన్న పంటకు ఆశించిన కత్తెర పురుగును పరిశీలిస్తున్న డీఏఓ మురళీకృష్ణ

చాగలమర్రి: ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీ కృష్ణ అన్నారు. బుధవారం ఆయన ఏఓ రంగ నేతాజి ఆధ్వర్యంలో చాగలమర్రిలోని చింతల చెరువు రస్తాలో జాకీర్‌హుస్సేన్ అనే రైతు పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో రబీ సీజన్‌లో 66,591 మంది రైతులు పంట బీమా చేయించారన్నారు. ప్రతి రైతు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని, ఇందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, శనగ, మినుము, వేరు శనగ పంటలకు ఈనెల 10వ తేది వరకు బీమా చేయించేందుకు గడువు ఉందని వెల్లడించారు. అనంతరం ఆయన చాగలమర్రిలోని పద్మావతి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్‌లో కొనుగోలు, అమ్మకం, స్టాకు బిల్లులు సరిగ్గా లేనందున రూ.1.43 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి జి.నరేంద్రారెడ్డి, ప్రకృతి వ్యవసాయ రైతులు జయరామిరెడ్డి, నగేశ్వరరెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతిని కాపాడిన పోలీసులు



కాపాడిన యువతిని బంధువులకు అప్పగిస్తున్న శ్రీశైలం పోలీసులు

శ్రీశైలం: కుటుంబ కలహాల కారణంగా భర్తతో గొడవ పడి ఇద్దరు పిల్లలను విడిచిపెట్టి చని పోవాలని శ్రీశైలం వచ్చిన సుతారి లక్ష్మిని శ్రీశైలం పోలీసులు, దేవస్థానం భద్రతా సిబ్బంది కాపాడగలిగారు. సీఐ ప్రసాద్‌రావు చెప్పిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా రాయదుర్గ్‌కి చెందిన సుతారి కిషోర్ భార్య సుతారి లక్ష్మి ఇంట్లో గొడవ పడి మంగళవారం శ్రీశైలం వచ్చి చని పోవాలని నిర్ణయించుకుందన్నారు. రాయదుర్గం పోలీసులు శ్రీశైలం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బుధవారం వన్‌టౌన్ పోలీసులు, దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది క్షేత్రమంతా వెతికి ఆమె ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకుని సుతారి లక్ష్మిని పోలీస్‌స్టేషన్ తీసుకువచ్చి భర్తకు, బంధువులకు సమాచారం అందజేశారు. శ్రీశైలం చేరుకున్న లక్ష్మీ భర్త కిషోర్, ఇతర బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి భద్రంగా ఆమెను వారికి అప్పగించినట్లు తెలిపారు.

శ్రీశైలంలో వ్యక్తి ఆత్మహత్య

శ్రీశైలం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లను పట్టుకుని మండలకేంద్రం గూడూరు గ్రామానికి చెందిన కనుమల దుర్గన్న (31) ఆత్మహత్య చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ ప్రసాదరావు చెప్పిన వివరాల మేరకు.. ఈనెల 5న కర్నూలు నుంచి శ్రీశైలం చేరుకున్న దుర్గన్న అదే రోజు రాత్రి స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నాడు. మంగళవారం ఉదయం 6:30 గంటల సమయంలో బస్టాండ్ సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లను పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో అతని చేతులు, కాళ్లు తీవ్రంగా కాలిపోయాయి. సబ్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బంది వెంటనే అతడిని సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయాడు. ఈ ఘటనపై బుధవారం మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా ఆర్థిక ఇబ్బందులతోనే అతను ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందన్నారు.

కోల్‌మాన్‌పేట కృష్ణకు సంక్రాంతి పురస్కారం



కృష్ణ దంపతులను సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయంలో విశేషంగా రాణిస్తున్న కృష్ణకు సంక్రాంతి పురస్కారం లభించింది. కోసిగి మండలం కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన కృష్ణ దాదాపు 14 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ మేరకు విజ్ఞాన్ పౌండేషన్, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 4న గుంటూరులో సంక్రాంతి పురస్కారం అందజేసింది. రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. కృష్ణ కుటుంబానికి 70 ఎకరాల భూమి ఉంది. 2012 నుంచి ఎలాంటి కెమికల్ లేకుండా వ్యవసాయం చేస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం లేనందున పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గింది. పండించిన ఉత్పత్తులకు బెంగళూరుకు చెందిన ప్రయివేటు సంస్థతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ కూడా ఆర్గానిక్ సర్టిఫికెట్స్ ఇచ్చాయి. కెమికల్స్ లేకుండా పండించడం, ఆర్గానిక్ సర్టిఫికెట్స్ కూడా ఉండటంతో ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడింది. ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు ప్రత్యేకంగా 40 దేశీవాలి ఆవులను కూడా పోషిస్తున్నారు. వరి, వేరుశనగ, మినుములు, కందులు,పెసర తదితర పంటలు సాగు చేస్తారు. జిల్లాలో మొదటి సారిగా ప్రకృతి వ్యవసాయం చేపట్టిన రైతు కృష్ణ కావడం విశేషం.

ఉత్తర దర్శనం.. నిత్య వైభవం

- పెరవలిలో వెలసిన శ్రీరంగనాథ స్వామి
- ఏడాదంతా ఉత్తర ద్వార దర్శనం
- స్వామిని టిప్పుసుల్తాన్ దర్శించారని ప్రతీతి
- ద్వాదశ అళ్వారులతో వెలిసిన వైష్ణవక్షేత్రం



శ్రీరంగనాథుడి మూల విరాట్, ఉత్సవమూర్తులు



శ్రీరంగనాథుడి దేవాలయం



శ్రీరంగనాథుడి ఆలయ ముఖద్వారం

మద్దికెర: వైష్ణవ క్షేత్రాల్లో భక్తులకు వైకుంఠ ఏకాదశి రోజున మాత్రమే ఉత్తర ద్వారంలో స్వామిని చూసే అవకాశం ఉంది. అయితే పెరవలి గ్రామంలో వెలిసిన శ్రీరంగనాథ స్వామిని సంవత్సరంలో 365 రోజుల పాటు ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకోవచ్చు. అదే ఈ ఆలయ ప్రత్యేకత. ఇక్కడ స్వామిని దర్శించుకుంటే చాలు అదే మహా భాగ్యం అని భక్తుల నమ్మకం.

ఆలయ చరిత్ర ఇదీ..

పెరవలిలోని శ్రీరంగనాథ స్వామి ఆలయం ద్వాదశ అళ్వారులతో వెలిసిన వైష్ణవ క్షేత్రంగా పూజలు అందుకుంటోంది. ఎందరో రుషులు తపమాచరించగా.. వారిని దర్శించుకునేందుకు శ్రీమన్నారుణుడే కపిల మహర్షి అవతారమెత్తి ఇచ్చటికి వచ్చి, శ్రీరంగనాథ స్వామి సాల గ్రామం ఇచ్చట ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. విజయనగర రాజులు, హరిహరరాయలు, బుక్కరాయలు.. క్రీ.శ. 1336–37లో ఆలయం నిర్మించినట్లు స్థల పూరణం చెబుతోంది. ఆలయ నిర్వహణకు వెయ్యి ఎకరాల మాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. భక్తులు కోరికలు తీరుస్తూ శ్రీరంగనాథస్వామి నిత్యం పూజలందుకుంటున్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

పెరవలి శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. అలాగే ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ ద్వాదశి నుంచి బహుళ సప్తమి వరకు పది రోజులు పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.

టిప్పు సుల్తాన్

కర్ణాటకలోని శ్రీరంగ పట్టణం రాజధానిగా చేసుకొని పరిపాలన చేస్తున్న టిప్పు సుల్తాన్ దండయాత్రలు చేసుకుంటూ ఒకరోజు పెరవలి వచ్చి, ఆలయాన్ని ధ్వంసం చేయబోతే స్వామి వారు శక్తిమంతురని, పిలిస్తే పలుకుతాడని ప్రజలు చెప్తారు. పరీక్ష చేసేందుకు స్వామి వారిని శ్రీరంగనాథా అని టిప్పు సుల్తాన్ పిలువగా 'ఓయ్' అనడంతో స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం తన అశ్వం ఎంతవరకు పరిగెత్తితే అంతవరకు స్వామి వారికి భూమిని టిప్పుసుల్తాన్ ఇచ్చారనే కథ కూడా ప్రచారంలో ఉంది.

ఆలయానికి ఇలా చేరుకోవచ్చు..

తుగ్గలి రేల్వే స్టేషన్ నుంచి పెరవలి గ్రామం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో ప్రయాణించి దేవాలయానికి 10 నిమిషాలలో చేరుకోవచ్చు. పత్తికొండ నుంచి కూడా ఆటోల్లో పెరవలికి రావడానికి వీలుంటుంది.

నిత్యం పూజలు



శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో స్వామి వారికి నిత్యం పూజలు జరుగుతుంటాయి. స్వామిని ఎప్పుడు దర్శించుకున్నా మాకు వైకుంఠ ఏకాదశి రోజు మాదిరిగా ఉంటుంది. స్వామి ఆశీస్సులు మాకు నిండుగా ఉంటాయి.

– గోపాల్, గ్రామస్తుడు

వైభవంగా నిర్వహిస్తారు



ఆలయంలో పూజలతో పాటు భక్తుల కోరిక మేరకు గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుతారు.

– రంగస్వామి, వీఆర్వో

ఏర్పాట్లు పూర్తి



ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. అలాగే 13వతేదీ గరుడోత్సవం, సాయంత్రం కల్యాణోత్సవం ఘనంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– వీరయ్య, కార్యనిర్వహణాధికారి

వర్సిటీల వీసీల ఎంపికకు సెర్చ్ కమిటీలు



రాయలసీమ విశ్వవిద్యాలయం

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్‌ల ఎంపికకు సెర్చ్ కమిటీలను నియమిస్తూ ఉన్నత విద్యా శాఖ జీవోలు జారీలు చేసింది. రాయలసీమ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వ నామినీగా గౌహతి ఎన్ఐపీఈఆర్ డైరెక్టర్ యూఎస్ఎన్ మూర్తి, యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా జోద్‌పూర్ యూనివర్సిటీ ఫార్మర్ వైస్ చాన్సలర్ సురంజన్ దాస్, యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నామినీగా తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ముత్తుకాలింగన్ క్రిష్ణన్‌లతో సెర్చ్ కమిటీని నియమించారు.

డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి..

రాష్ట్ర ప్రభుత్వ నామినీగా ఆది కవి నన్నయ యూనివర్సిటీ ఫార్మర్ వైస్ చాన్సలర్ కె. నిరూపరాణి, యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా మద్రాస్ యూనివర్సిటీ ఫార్మర్ వైస్‌చాన్సలర్ పి. దురైసామి, యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నామినీగా లక్నో డాక్టర్ శకుంతల మిశ్రా నేషనల్ రీహాబిలిటేషన్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సంజయ్ సింగ్‌లతో కూడిన సెర్చ్ కమిటీని నియమించారు. వీరు వారం రోజుల్లో సమావేశమై వైస్ చాన్సలర్ దరఖాస్తులను స్క్రూటినీ చేసి ముగ్గురు ప్రొఫెసర్లతో కూడిన జాబితాను సిద్ధం చేయనున్నారు. రాయలసీమ యూనివర్సిటీకి 160, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి 60 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఉద్యోగులకు కలసి వచ్చిన సెలవులు

కర్నూలు(అగ్రికల్చర్): సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రెండు రోజులు అదనంగా కలసి వచ్చాయి. ఈ నెల 11న రెండో శనివారం, 12న ఆదివారం సెలవు దినాలు, 13న భోగి, 14న మకర సంక్రాంతి, 15న కనుమ ఉండటంతో ప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించింది. బ్యాంకులకు మాత్రం 14న మకర సంక్రాంతి పండుగ సెలవు ఒక్క రోజు మాత్రమే ఉంది.

11న జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 11న జూనియర్ బాల, బాలికల విభాగంలో జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు 20 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 25 వరకు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9393855460ను సంప్రదించాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో చేనేత వస్త్రాలు

- ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్ శివప్రసాద్

కర్నూలు(అగ్రికల్చర్): అన్ని రకాల చేనేత వస్త్రాలను ఆన్‌లైన్‌లో అధికార వెబ్‌సైట్ www.apcohandlooms.coms ద్వారా పొందవచ్చని డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్ బి.శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని ఆప్కో మెగా షోరూం, కలెక్టరేట్‌లోని నేత బజారు, కొండారెడ్డిబురుజు సమీపంలోని లేపాక్షి ఎంపోరియం, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల జిల్లాలోని నంద్యాల, శ్రీశైలం ఆప్కో షోరూముల్లో అత్యాధునిక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని రకాల వస్త్రాలపై 30 శాతం డిస్కౌంట్ ఇస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

బేతంచెర్ల: మండలంలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న మామిడి తోటలోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 25 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4.22 లక్షల నగదు, 25 సెల్ ఫోన్లు, 10 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు వెల్లడించారు.

అన్నప్రసాద వితరణకు పచ్చళ్ల విరాళం



విరాళంగా ఇచ్చిన పచ్చళ్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు బుధవారం ఆదిభట్ల గ్రామానికి చెందిన నిరంజన్‌రెడ్డి, హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన కిషన్‌సింగ్, హైదరాబాద్ మూసాపేట్‌కు చెందిన శ్రీశైలంగౌడ్ పచ్చళ్లను విరాళంగా అందజేశారు. సుమారు రెండు టన్నుల మామిడికాయ, నిమ్మకాయ పచ్చళ్లను అన్నప్రసాద వితరణలో భక్తులకు వడ్డించేందుకు దాతలు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు. ఈ పచ్చళ్లను డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, అన్నప్రసాద వితరణ పర్యవేక్షకులు గంజి రవి సమక్షంలో అందజేశారు.

భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి హల్‌చల్

- విజయ డెయిరీలో చైర్మన్ ఎక్కడ అంటూ హడావుడి



డెయిరీ ఆవరణలో భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోదరుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి విజయ డెయిరీలో హల్‌చల్ చేశారు. నలుగురు డైరెక్టర్లతో కలిసి భూమా విఖ్యాత్‌రెడ్డి బుధవారం విజయ డెయిరీకి చేరుకున్నారు. 'చైర్మన్, ఎండీలు ఎక్కడ' అంటూ హడావుడి చేశారు. తనపై కోపం ఉంటే ఏమైనా చేసుకోవచ్చు కాని.. చక్రవర్తుల పల్లె సొసైటీ రద్దు చేస్తే రైతులపై కక్ష తీర్చుకున్నట్లు అవుతుందన్నారు. డెయిరీ ఎండీ ప్రదీప్‌కుమార్‌తో కొద్దిసేపు సమావేశమయ్యారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తనను విచారించకుండా సొసైటీ రద్దు అయ్యిందని చెప్పడం దారుణమన్నారు. ఐదేళ్లగా గుర్తుకు రానిది ఈ రోజు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. జగత్ డెయిరీలో ఒక భాగాన్ని కోవిడ్‌కు ముందే మూసేశామని, గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో జగత్ డెయిరీని నడపలేమని అర్థమైందన్నారు. చక్రవర్తుల పల్లె సొసైటీ మెంబర్‌గా ఉన్న తనకు సొసైటీ రద్దు విషయంపై ఒక్క నోటీసులు కూడా అందలేదన్నారు. చాగలమర్రి మండలం చక్రవర్తుల పల్లె సొసైటీ రద్దు అంత సులభం కాదని, సింగిల్ హియరింగ్‌తో స్టే తెచ్చుకొనే సత్తా తనకుందన్నారు. ఏదేమైనా సొసైటీ రద్దు విషయంపై కోర్టులో తేల్చుకుంటామన్నారు.

24 నుంచి క్రెడాయి ప్రాపర్టీ షో



ప్రాపర్టీ షో బ్రోచర్లను అవిష్కరిస్తున్న క్రెడాయి చైర్మన్ సోమిశెట్టి వెంకట్రామయ్య, సభ్యులు

కర్నూలు (టౌన్): స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు క్రెడాయి (కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్, డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్లు క్రెడాయి చైర్మన్ సోమిశెట్టి వెంకటరామయ్య వెల్లడించారు. స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న క్రెడాయి కార్యాలయంలో అసోసియేషన్‌కు చెందిన సభ్యులు బుధవారం 2025 – క్రెడాయి ప్రాపర్టీ షో బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ప్రాపర్టీషోలో బిల్డర్లు, గృహ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్స్, బ్యాంకర్లు, ఇంటీరియర్స్, ఆటోమొబైల్స్ రంగాలకు సంబంధించిన వారంతా ఈ షోలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రాపర్టీ షోకు స్పాన్సర్‌గా రాగ మయూరి బిల్డర్స్, కో స్పాన్సర్‌గా స్కందాన్షి ఇన్ఫ్రా ప్రాజెక్టు వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్రెడాయి కర్నూలు చాప్టర్ అధ్యక్షులు సాయిరాం రెడ్డి, కన్వీనర్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సురేష్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రిజేష్ సింగ్ మేనేజర్ శంకర్, శృతి పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక

- కర్నూలు రానున్న మంత్రి నారా లోకేష్

కర్నూలు(అర్బన్): గడివేముల మండలం గని ప్రాంతానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం రానున్నారు. హెలికాప్టర్‌లో గని సోలార్ పార్క్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును వీక్షించనున్నారు. అనంతరం అప్పర్ ఇంటెక్ వ్యూ పాయింట్‌కు చేరుకొని ప్రాజెక్టును పరిశీలించి వసతి గృహం చేరుకుంటారు. ప్రాజెక్టు వివరాలు తెలుసుకుని సాయంత్రం 4.25 గంటలకు హెలికాప్టర్‌లో ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి గన్నవరానికి విమానంలో వెళ్తారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖా మంత్రి నారా లోకేష్ గురువారం రాత్రి 11 గంటలకు అనంతపురం నుంచి కర్నూలుకు రానున్నారు. శుక్రవారం నగరంలోని పలు కళాశాలలను పరిశీలించి.. అదేరోజు ఏపీఎస్పీ గ్రౌండ్స్ చేరుకొని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖా మంత్రి టీజీ భరత్ కుమార్తె రిసెప్షన్ వేడుకల్లో పాల్గొననున్నార. మధ్యాహ్నం 1.30 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకొని బయలుదేరి వెళ్తారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



విద్యార్థులకు ట్రోఫిని అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): కృషి, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని న్యాయశాఖా మంత్రి ఫరూక్, రిటైర్డ్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం రాత్రి నంద్యాల పట్టణశివారులో ఉన్న ఆర్జీఎం ఇంటర్‌నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను చైర్మన్ మిద్దె శాంతిరాముడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి ఫరూక్‌తో పాటు రిటైర్డ్ జేడీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతోగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కూడా విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా ముందుండాలన్నారు. క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శాంతిరాం మెడికల్ కళాశాల డైరెక్టర్ మిద్దె శివరాం, రఘురాం, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరిపోయిన ఆశల దీపం

- రోడ్డు ప్రమాదంలో కుమారుడి మృతి
- దుఃఖ సాగరంలో తల్లిదండ్రులు



మృతి చెందిన వెంకట చరణ్ రెడ్డి (ఫైల్)

అవుకు: కుటుంబానికి కుమారుడు అండగా ఉన్నాడని, తమ ఆశలు నెరవేరుతాయని తల్లిదండ్రులు అనుకున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో కుమారుడి మృతి వారిని దుఃఖ సాగరంలో ముంచింది. ట్రాక్టర్ కింద పడి పాణ్యం వెంకట చరణ్ రెడ్డి (24) మృతి చెందడంతో అవుకు మండలం రామాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన పాణ్యం లక్ష్మి రెడ్డ, పాణ్యం సువర్ణ కుమారుడు పాణ్యం వెంకట చరణ్‌రెడ్డి. తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగించేవారు. నాలుగు సంవత్సరాల క్రితం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం కోటూరి గ్రామానికి చెందిన సుజాతతో వెంకట చరణ్‌రెడ్డికి వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర వయస్సు ఉన్న గణేష్ రెడ్డి కుమారుడిగా ఉన్నాడు. రోజూ మాదిరిగానే నాపరాయి బండలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని ధర్మవరానికి తీసుకెళ్లారు. డ్రైవింగ్ మరొక వ్యక్తి చేస్తుండగా డ్రైవర్ పక్కనే వెంకట చరణ్‌రెడ్డి కూర్చొని నిద్రమత్తులో ఉన్నాడు. అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట సమీపంలోని అటవీప్రాంతంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌లో నుంచి కిందపడిపోయాడు. ట్రాక్టర్ టైర్ ఎక్కడంతో వెంకట చరణ్‌రెడ్డి అక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని భార్య, తల్లిదండ్రులు బోరున విలపించారు. తండ్రిని కోల్పోయిన ఆ బాలుడిని చూసి గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

పరారైన దొంగ దొరికాడు



పట్టుబడిన నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు

ఆదోని అర్బన్: పోలీసుల కళ్లుగప్పి పరారైన దొంగను ఆదోని టూటౌన్ పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. సీఐ సూర్యమోహన్‌రావు బుధవారం విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మొయినా బాద్‌కు చెందిన మురళి అలియాస్ ముత్యాలుపై ప్రొద్దుటూరు, కర్నూలు, ఆదోని, కోడుమూరు, జోన్‌ల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దాదాపు 74 చోరీ కేసులు ఉన్నాయి. ఈనెల 4వ తేదీన కోర్టు వాయిదా కోసం ఆదోనికి వచ్చాడు. అదే రోజున స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులో ఉన్న మిల్క్ డైరీలో దొంగతనం చేసి అందులో రూ.10 వేలు నగదును అపహరించాడు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా పోలీసులు దర్యాప్తు చేపట్టి అనుమానితుడిగా మురళీని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు ఈ మేరకు 5వ తేదీన కోర్టులో హాజరుపరిచేందుకు తరలిస్తుండగా కోర్టు సమీపంలో బాత్‌రూమ్‌కు వెళ్తానని చెప్పి పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సిబ్బంది పరశురామ్, నాగరాజు, గిరిబాబు, రమణలు బృందంగా ఏర్పడి నిందితుడు స్వగృహమైన మొయినాబాద్‌కు వెళ్లి గాలించి పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చాటిన సిబ్బందిని సీఐ అభినందించారు.

మహానందీశ్వరుడి ఇనాం భూములపై విచారణ



విచారణ చేస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ అధికారులు

మహానంది: తమ్మడపల్లె గ్రామంలోని శ్రీ మహానందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన అనకల ఇనామ్, కుమ్మరుల ఇనామ్ భూములకు సంబంధించి సర్వీసు దారులు పట్టాదారు పాసు పుస్తకాలు తయారు చేయించుకుని రుణాలు పొందుతున్నారు. దీనిపై దేవస్థానం ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో ఇనాందారులను విచారించారు. సర్వే నెంబరు 314లో 1.19 ఎకరాలకు వెంగన్న పేరు మీద చేయించిన పాసుపుస్తకాన్ని రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులకు అప్పగించారు. అలాగే సర్వే నెంబరు 303లో ఉన్న 8.47 ఎకరాల భూములకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 17వ తేదీ విచారణకు హాజరు కావాలని తహసీల్దార్ రమాదేవి ఆదేశించారు. ఈఓ మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్, 43 రిజిస్టర్, ఆర్ఎస్ఆర్ రికార్డుల్లో దేవస్థానం పేరు మీదనే ఉన్నాయన్నారు. కానీ ఇనాందారులు ఏకంగా పాసుపుస్తకాలు వారిపేరు మీదనే చేయించుకున్న విషయంపై విచారణ చేస్తే అసలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. ఆలయ భూములను ఇనాం దారులు ఎవరైనా దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారెడ్డి, నాగమల్లయ్య, మల్లికార్జునయ్య పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసు నమోదు

ఆదోనిరూరల్: పెద్ద హరివాణం గ్రామానికి చెందిన ఓ పత్రికా విలేకరి (సాక్షి కాదు) తిమ్మప్ప, అతని స్నేహితుడు సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన కేవీపీఎస్ నాయకుడు తిక్కప్పపై లైంగిక వేధింపుల కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఓ మహిళను పైఇద్దరు వ్యక్తులు తమ కోర్కె తీర్చాలని వేధించడంతో పాటు కులం పేరుతో దూషిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించారని బాధితురాలు బుధవారం ఇస్వీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

కారు ఢీకొని బాలుడికి గాయాలు

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన ఓ బాలుడిని కారు ఢీకొన్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలానికి చెందిన ఆంజనేయులు ఆయన కుటుంబ సభ్యులతో మహానందికి వచ్చారు. మహానందీశ్వర స్వామి దర్శనానికి వచ్చిన వారు వారి వాహనం వద్దకు వెళ్లే క్రమంలో స్థానిక దేవస్థానం కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా వారిలో బాలుడు కార్తీక్‌ను మహానంది వైపు వస్తున్న ఓ కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. గాయపడిన కార్తీక్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.